పునఃప్రారంభానికి వేళాయే.. ఫిట్‌నెస్ జాడలేదాయే..

-నగరంలో సగానికి పైగా స్కూల్ బస్సులకు లేని ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు

- 12 లోపు గడువు ముగుస్తున్నా పూర్తికాని తనిఖీలు

-విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులలో తీవ్ర ఆందోళన

హైదరాబాద్, జూన్ 4 (ప్రభాతవార్త):

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముహూర్తం దగ్గరపడుతున్నా, విద్యార్థులను సురక్షితంగా పాఠశాలలకు చేర్చాల్సిన స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో తిరిగే సుమారు 14,200 పాఠశాల బస్సులలో సగానికి పైగా (దాదాపు 55 బస్సులు) ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉందని రవాణా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారులు గడువు విధిస్తున్నా, యాజమాన్యాలు తనిఖీలకు ముందుకు రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖాధికారుల ప్రాథమిక పరిశీలనలో తనిఖీలకు వచ్చిన అనేక బస్సులలో తీవ్ర భద్రతా లోపాలు బయటపడ్డాయి. కాలం చెల్లిన టైర్లు, విఫలమవుతున్న బ్రేకింగ్ వ్యవస్థలు, దెబ్బతిన్న స్టీరింగ్ భాగాలు, ప్రథమ చికిత్స (ఫస్ట్‌ఎయిడ్) కిట్లు లేకపోవడం, ఫైర్ సేఫ్టీ పరికరాల కొరత వంటి లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం జూన్ 12 లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందని ఏ ఒక్క బస్సును కూడా రోడ్డుపైకి అనుమతించబోమని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తామని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జి. సదానందం హెచ్చరించారు. జీహెచ్ ఎం సి పరిధిలో మొత్తం స్కూల్ బస్సులు 14,200 ఉండగా ఇందులో ఫిట్‌నెస్ పొందినవి కేవలం 45 మాత్రమే, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో 6,300 , 6,400 , 1,500 బస్సులు ఉన్నాయి. గడిచిన విద్యా సంవత్సరంలో స్కూల్ బస్సుల నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వరంగల్‌లో ట్రాక్టర్‌బస్సు ఢీకొని ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. మోయినాబాద్ (మృగవని వద్ద), ఖమ్మంలలో స్కూల్ బస్సులు బోల్తా పడి పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడ్డారు. శంషాబాద్, పటాన్‌చెరు, మియాపూర్ ప్రాంతాలలో స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికావడమే కాకుండా, కొన్ని చోట్ల బస్సులలో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సంఘటనలు తల్లిదండ్రులను నేటికీ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కాగా బస్సుల కండిషన్‌తో పాటు డ్రైవర్ల శారీరక శ్రమ, ప్రవర్తన కూడా ఆందోళనకరంగా మారింది. దాదాపు 400 నుండి 500 మంది డ్రైవర్లను పరీక్షించగా, వారిలో కొందరికి గుండె సంబంధిత సమస్యలు, కంటి చూపు లోపాలు ఉన్నట్లు తేలింది. అలాగే కొంత మంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడటం, బస్సులలో అటెండెంట్లు ఉన్నప్పటికీ విద్యార్థులపై వేధింపులు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటు వాహనాలూ ప్రమాదకరమే!

స్కూల్ బస్సులతో పాటు ఆటోలు, ప్రైవేట్ వ్యాన్లు, సొంత వాహనాలలో పిల్లలను పరిమితికి మించి ఎక్కించి తరలిస్తుండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యాలు కేవలం బస్సులకే పరిమితం కాకుండా, ప్రైవేట్ ఆటోలు, వ్యాన్ల డ్రైవర్ల వివరాలను, వారి వాహనాల రికార్డులను కూడా క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. మరో వైపు రవాణా శాఖ నిబంధనల ప్రకారం పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ప్రతి వాహనం తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. లోపాలు ఉన్న వాహనాలకు నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లోగా వాటిని సరిచేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రాణాలతో సులభంగా ఆడుకునే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్ వార్త

గాంధీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందాలి

-వైద్యపరికరాల కొనుగోలుకు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

-జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

హైదరాబాద్,జూన్ 4,ప్రభాతవార్త:

గాంధీ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ఆదేశించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం ఆస్పత్రి ప్రధాన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌ఎన్ వాణితో పాటు అన్ని వైద్య విభాగాల వైద్యాధిపతులు (హెచ్‌ఓడీలు) పాల్గొని, ఆయా విభాగాల్లో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, వైద్య పరికరాల ఆవశ్యకత మరియు ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిపై చర్చించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్‌లో భాగంగా గాంధీ ఆసుపత్రికి అత్యవసరంగా కావలసిన మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు, అలాగే పాత బకాయిలను చెల్లించడానికి వినియోగించాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ నేపథ్యంలో 2021 నుంచి ఇప్పటివరకు వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఖర్చు చేసిన బిల్లులను రాటిఫికేషన్ (ఆమోదించడం) చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా గాంధీలోని అన్ని వైద్య విభాగాల వారీగా హెచ్‌ఓడిలతో సమీక్ష నిర్వహించారు. మెడికల్ ఎక్విప్మెంట్ తదితర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాల్లో అత్యవసరమైన వైద్య పరికరాలను హెచ్‌డిఎస్ ఫండ్ నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. దాంతో పాటు ఎంసీహెచ్ (మాతా శిశు సంరక్షణ కేంద్రం) లోని ఐవీఎఫ్ ఎంబ్రాలజిస్ట్‌కు ఇన్సెంటివ్‌ల మంజూరు, ల్యాబ్ రీఏజెంట్స్ బకాయిలు, ఆసుపత్రికి మందులు సరఫరా చేసిన సప్లయర్లకు చెల్లించాల్సిన బకాయిలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం నుంచి గాంధీ ఆరోగ్యశ్రీ విభాగానికి దాదాపు రూ. 70 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రికి సంబంధించిన హెచ్‌డీఎస్ ఫండ్స్ రూపంలో రూ. 6 కోట్లు అందుబాటులో ఉన్నాయని, ఈనిధులను సమర్థవంతంగా వాడుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన వైద్య పరికరాలు, ఇతర అత్యవసర పనులకు కేటాయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఇందిరా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కే సునీల్, ఏవో పద్మిని, హెచ్‌డిఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డిఎస్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వాణి

ప్రజల భద్రతకు ఇబ్బంది లేకుండా చర్యలు

-శిథిలావస్థ భవనాలు, సెల్లార్ల తవ్వకాలు,హోర్డింగ్‌ల గుర్తింపు

-టౌన్‌ప్లానింగ్ అధికారులతో సిఎంసి కమిషనర్ సృజన సమీక్షా

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:

ప్రజలకు భద్రతకు ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ జి.సృజన అన్నారు. ఈమేరకు గురువారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో కమిషనర్ జోనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ), సిటీ ప్లానర్లు (సీపీలు), డిప్యూటీ కమిషనర్లు,టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న వివిధ పట్టణాభివృద్ధి పౌరసేవల కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం, బిల్డ్ నౌద్వారా అందుతున్న భవన నిర్మాణ అనుమతి దరఖాస్తులు, ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్).. దరఖాస్తులు, పెండింగ్ కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఆక్రమణల తొలగింపు, అలాగే రహదారుల విస్తరణకు సంబంధించిన భూసేకరణ అంశాల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మాన్సూన్ సన్నద్ధత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, సెల్లార్ తవ్వకాలు మరియు అనధికారిక హోర్డింగ్‌లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు .అలాగే .పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలని, ప్రాధాన్యతా పనులను వేగవంతం చేయాలన్నారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి అవసరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జిసృజన, సిసిపి వెంకన్న తదితరులు

చార్మినార్ పరిసర ప్రాంతాలలో కెటిఆర్ సందడి

నిమ్రా కేఫ్‌లో ఛాయ్ తాగుతున్న మాజీ మంత్రి కేటిఆర్

చార్మినార్,జూన్ 4 ప్రభాతవార్త : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీమంత్రి కేటిఆర్ గురువారం ఉదయంలో చార్మినార్ పరిసర ప్రాంతాలలో సందడి చేశారు.చంచల్‌గూడ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కలిసిన అనంతరం మాజీ మంత్రి కేటిఆర్ చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి అలీ మస్కతితో కలిసి చార్మినార్‌కు చేరుకున్నారు.చార్మినార్ సమీపంలో ఉన్న నిమ్రాహ్ కేఫ్‌లో మాజీ మంత్రి కేటిఆర్ ఉస్మానియా బిస్కెట్లు తిని ఛాయ్ త్రాగారు.అనంతరం చారిత్రక చార్మినార్ ఎదురుగా సందర్శకులతో కలిసి సరదాగా గడిపారు.పాతబస్తీకి చెందిన బిఆర్ఎస్ నాయకులు,సందర్శకులతో కలిసి కేటిఆర్ సెల్ఫీలు దిగారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి అలీ మస్కతి,హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్,బహదూర్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మీర్ ఇనాయత్ అలీ బాక్రీ,మలక్ పేట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీ,బిఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్,అనిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

13 మంది రౌడీ షీటర్ల బైండోవర్

-శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

-డిసిపి శ్రీనివాస్ హెచ్చరిక

అత్తాపూర్ జూన్4 ,ప్రభాతవార్త :

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడటానికి ,నేరాలను అదుపు చేయడానికి పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 13 మంది రౌడీ షీటర్లను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచగా సీఐ నాగేశ్వర్ రావుతో కలిసి డిసిపి శ్రీనివాస్ కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తన కోసం రౌడి షీటర్ల ను బైండోవర్ చేశారు.రౌడిషీటర్లు మహమ్మద్ మోయినుద్దీన్ (34) మహమ్మద్ షాబాజ్ ఖాన్ (25) ఎండి. ఖదీర్ (43) ఎండి. యాసీన్ (35)సయ్యద్ ఇమ్రాన్ (29)మహమ్మద్ అజ్మత్ (30)షేక్ రషీద్ (31మొహమ్మద్ ఒమర్ (24)సయ్యద్ జకరియా అహ్మద్ అలియాస్ షాఫెజ్ (23)మహమ్మద్ యూసుఫ్ అలియాస్ యూసుఫ్ మాము (48)ఎండి అలీఖాన్ (34) ఎస్కా కుర్బాన్ (31)మహమ్మద్ షరీఫ్ (27)లకు బైండోవర్ చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ....చట్టవ్యతిరేక కార్యకలాపాలు, గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలు, అక్రమ వసూళ్లు, భూకబ్జాలు మరియు ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్తులో ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రౌడీ షీటర్లు సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి సక్రమ జీవనం గడపాలని, ఉపాధి మార్గాలను ఎంచుకుని నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ప్రజల సహకారంతో నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి

-హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 4 ప్రభాతవార్త

హైదరాబాద్‌లో బస చేసే విదేశీయుల కదలికలపై నిఘా పెంచడమే లక్ష్యమన్న పోలీసులుహోటళ్లు, హాస్టళ్లు, ఇంటి యజమానులందరికీ ఈ నిబంధన వర్తింపుహైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం।। (ఫారంసి) సమర్పించాలి. విద్యా సంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం।।లో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి.2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు.

దేశంలో విదేశీయుల కదలిక లపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హుల వుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

అజరామరం పద్యనాటకం

అజరామరం పద్యనాటకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, జూన్ 4 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) ఆరుబయలు కళామందిరంలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన 99 రోజులపాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో 64వ రోజు రాత్రి దోరవేటి చెన్నయ్య రచన, దర్శకత్వంలో రూపొందిన చారిత్రాత్మక పద్యనాటకం అద్భుతంగా ప్రదర్శింపబడి ప్రేక్షకుల మదిని దోచుకుంది. ప్రధానపాత్రల్లో డా. తలారి ధాకన్న, కమలేష్, యామిని సీతాంజలి, తలారి ఆశీర్వాదం, జానకి రామారావు, శ్రీనయ్య, గురునాధం, కె.మధుసూదనరావు, నర్సిములు, హనుమంతు, కాసుల ఆక్షిత, మణికంఠ నటించగా కీబోర్డుపై శంకర్ మాస్టర్, తబలాపై శశిభూషణ్‌లు అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత మెప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి కళాకారులను ఘనంగా సన్మానించి ప్రశంసించారు. వ్యాఖ్యాతగా విద్యానందచారి కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

నగరంలో 'నకిలీ చాక్లెట్లు'

-ప్రమాదకర రసాయనాలతో తయారీ

న-ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:

పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ చాక్లెట్లు

నగరంలో నకిలీ చాక్లేట్ల తయారీ కలకలం రేపింది. ప్రమాదకరమైన రసాయనాలతో చాక్లెట్లను తయారు చేస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. సీతారాం బాగ్ లో నకిలీ, గడువు ముగిసిన చాక్లెట్ల తయారీ కేంద్రంపై హెచ్ ఫాస్ట్, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఒకరిని అరెస్ట్ చేయగా.. భారీగా నిషేధిత, గడువు ముగిసిన చాక్లెట్ ఉత్పత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కొండ కార్తీక్ నిబంధనలకు విరుద్ధంగా చాక్లెట్లను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చాక్లెట్ ప్యాకెట్ల లేబుళ్లపై తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, గడువు ముగింపు తేదీ, బెస్ట్ బిఫోర్ వివరాలు ఏవీ లేకపోవడాన్ని అధికారులు నిర్ధారించారు. మరింత లోతుగా పరిశీలించగా, చాక్లెట్ల తయారీలో గడువు ముగిసిపోయిన ఫ్లేవర్లు, ఎస్సెన్స్, వివిధ రకాల రంగు పొడులను నిల్వ ఉంచి వాడుతున్నట్లు గుర్తించారు. అలాగే సదరు సంస్థకు కొత్త ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్ ఉన్నప్పటికీ.. పాత లైసెన్స్ నంబర్ వివరాలతో ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు తేలింది. వీటితో పాటు, అక్కడ పనిచేసే సిబ్బందికి ఎలాంటి వైద్య ధృవీకరణ పత్రాలు లేకపోవడం, పెస్ట్ కంట్రోల్ రికార్డులను నిర్వహించకపోవడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి.

పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

-ప్రమాదంలో రెండు కార్లు సైతం ధ్వంసం- తప్పిన పెను ప్రమాదం

రోడ్డులో అడ్డంగా బోల్తా పడిన ట్యాంకర్

హయత్ నగర్, జూన్ 4 ప్రభాతవార్త :

విజయవాడ జాతీయ రహదారిపై పెద్ద అంబర్ పేట సమీపంలో లక్ష్మారెడ్డి పాలెం ఆంజనేయస్వామి ఆలయం ముందు గురువారం సాయంత్రం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. నగరానికి వస్తున్న ఒక కారు మరో కారును, పక్కన వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ ను ఢీ కొట్టడంతో ట్యాంకర్ అదుపు తప్పి అడ్డంగా తిరిగి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే బోల్తా పడిన పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ అందులో ఇరుక్కు పోయాడు.

విషయం తెలుసుకున్న ట్రాఫిక్ అదనపు డీసీపి శ్రీనివాస్ కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, హయత్ నగర్ సీఐ నాగరాజు గౌడ్, డీఐ సంతోష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలు అంటుకోకుండా అగ్నిమాపక వాహనాల సిబ్బంది ఫోమ్ చల్లారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి ట్యాంకర్ డ్రైవర్ ను బయటకు తీసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అనంతరం రోడ్డుకు అడ్డంగా పడిన ట్యాంకర్ ను క్రెన్ ల సహకారంతో అక్కడినుండి తొలగించారు.

ఒక్కసారిగా వెదర్‌చేంజ్

-చిరుజల్లులతో చల్లబడిన సిటీ



హైదరాబాద్,జూన్ 4 ప్రభాతవార్త

నగరంలో ఒక్కసారిగా వెదర్ చేంజ్ అయ్యింది. చిరుజల్లులతో చల్లబడింది.రుతుపవనాల రాక ఆలస్యమవ్వడంతో మరికొన్ని రోజుల్లో ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే గురువారం ఉదయం నుండి ఎండ దంచికొట్టినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి చిరుజల్లులు కురిశాయి. దీంతో రోడ్ల మీద ఉన్న వాహనదారులు చిరుజల్లులతో ఉపశమనం పొందారు.ఈ దెబ్బతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి సిటీ చల్లబడింది.

బోడుప్పల్‌లో చెత్తకు నిప్పు.. రెండు కార్లు దగ్ధం

ఉప్పల్, జూన్ 4 ప్రభాతవార్త :

బోడుప్పల్‌లో ఖాళీ ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో రెండు కార్లు దగ్ధం అయ్యాయి. పోలీ సులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లోని ఓ ఖాళీ ప్రదేశంలో గురువారం ఉదయం గుర్తు తెలియ ని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టారు. దీంతో అక్కడ పార్కు చేసి ఉన్న మూడు కార్లు దహనం అయ్యాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచా రం అందించడంతో అక్కడికి చేరుకుని మంటలు అర్పివేశారు. చెత్తకు నిప్పు పెట్టడంతో కారు టైర్లకు మంటలు అంటుకుని కార్లు తగలపడినట్లు పోలీసులు తెలిపారు. అందులో ఒక కారు కొని ఏడాది కూడా కాలేదని, యజమాని ఎండ కాలంలో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేం నరేందర్ రెడ్డిని కలిసిన సుబ్రహ్మణ్య ప్రసాద్

చిక్కడపల్లి జూన్ 4,ప్రభాతవార్త : తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు వైస్ చైర్మన్‌గా నియమితులైన పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ గురువారం రాజ్యసభ సభ్యుడు వేంనరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రముఖ సంఘసేవకులు నైషధం సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు కళలే మూలం : డిజిపి సౌమ్య మిశ్రా

కళాకారులను సత్కరిస్తున్న డీజీపీ సౌమ్య మిశ్రా

చిక్కడపల్లి జూన్ 4 , ప్రభాతవార్త : సృజన కల్చరల్ అండ్ లిటరరీ ఆర్గనైజేషన్ నిర్వహణలో, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన భారతీయ నృత్యోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈ ఉత్సవాల్లో భాగంగా కళాకారులు ప్రదర్శించిన జానపద, సాంప్రదాయ నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బైంగా, గొండియా, లంబాడీ వంటి జానపద నృత్యాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మణిపురి, మోహినీయాట్టం, కథక్, ఒడిస్సీ, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రక్రియలను కళాకారులు మనోహరంగా ప్రదర్శించారు. ముఖ్యంగా అరుదైన ఖిలావణిఖి, ఖిసింహానందినిఖి, ఖికర్మఖి నృత్యాలు ప్రేక్షకులను ముగ్ధులను చేశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సౌమ్య మిశ్రా మాట్లాడుతూ దేశ సమైక్యతను బలపరిచే శక్తి కళలకు మాత్రమే ఉందన్నారు. విభిన్న భాషలు, మతాలు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో సంగీతం, నృత్యం, సాహిత్యం ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. సాంస్కృతిక, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కళల అభివృద్ధికి, కళాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సృజన సంస్థ అధ్యక్షురాలు అంజనా చౌదరి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో జాతీయ నృత్యోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రమ్య, కోశాధికారి సుధీర్ తదితరులు పాల్గొని పర్యవేక్షి చారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను అభినందించిన కంటోన్మెంట్ నేతలు

ఎమ్మెల్యేను అభినందిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, జూన్ 4 ప్రభాతవార్త: ఎమ్మెల్యేగా (ఉప ఎన్నికలో) గెలిచి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు కంటోన్మెంట్ కాంగ్రెస్ నేత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం బోయిన్ పల్లి లోని జంపన నివాసాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ ను జంపన కుటుంబ సభ్యులు, జంపన యువసేన ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జంపన దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే గా రెండు సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం జంపన తో ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంపై భేటీ అయి సుదీర్ఘంగా చర్చించారు.

సమాచారాన్ని తెలుసుకునే హక్కును ఆర్‌టిఐ కల్పించింది : చంటి ముదిరాజ్

: సమావేశంలో మాట్లాడుతున్న డా.చంటి ముదిరాజ్

సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: సమాచార హక్కు చట్టం ప్రజలకు పారదర్శక పాలనను అందించేందుకు అత్యంత కీలకమైన చట్టమని సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ ఛైర్మన్ డా.చంటి ముదిరాజ్ చెప్పారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అధికారుల పనితీరుపై ప్రజలకు సమాచారం తెలుసుకునే హక్కును ఈ చట్టం కల్పి ంచిందన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాధన కమిటికి నూతనంగా జాతీయ సహాయ కార్యదర్శిగా అన్నవరం సందీప్‌ను నియమించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. అవినీతి, అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగం వంటి అంశాలను వెలుగులోకి తీసుకురావడంలో ఆర్‌టిఐ చట్టం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతిపౌరుడు ఈ చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. దేశ వ్యాప్తంగా తమ కమిటీ ద్వారా ప్రజలకు న్యాయం అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ చేయడం, అవినీతిపై పోరాటం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర కార్యానిర్వాహక అధ్యక్షుడు చింతల రఘువేందర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు ప్రకాష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వేద విద్య తరగతులు

హైదరాబాద్, జూన్ 4 ప్రభాతవార్త

శ్రీవైష్ణవిదేవి వేద విద్యా పీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేద విద్యను ఉచితంగా అభ్యసింపబడునని జాతీయ జ్యోతిష్య రత్న పురస్కార గ్రహిత, జ్ఞాన ప్రబోధానంద సరస్వతి దైవజ్ఞాలు, బ్రహ్మశ్రీ సురోజు ఉపేంద్ర ఆచార్యులు అన్నారు. గురువారం కాచిగూడలో విలేకరులతో ఉపేంద్ర దీక్షితులు మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల విశ్వబ్రహ్మణ యువతి, యువకులకు ఈ వేద విద్యను ఉచితంగా నేర్పించబడునని వెల్లడించారు. గత 25 యేండ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పురోహితం, జ్యోతిష్య సేవాలను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల యువత వివరాలకు 73962 35319, 8901320353లో సంప్రదించాలని కోరారు.

రెండు రాష్ట్రాల్లో త్యాగరాయ గానసభ తలమానికం : బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి జూన్ 4 (ప్రభాతవార్త) : కళా సుబ్బారావు, గుండవరపు హనుమంతరావు తదితర మహానుభావుల కృషితో ప్రారంభమైన త్యాగరాయ గానసభ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే తలమానికంగా నిలిచిందని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ 60 సంవత్సరాల వేడుకలు గానసభ ప్రధాన వేదికపై గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ జంట నగరాల్లో చరిత్రాత్మకమైన త్యాగరాయ గానసభ గత అరవై ఏళ్లుగా ఎందరో గొప్ప కళాకారులకు వేదికగా నిలిచిందని చెప్పారు. చిన్నగా ప్రారంభమైన ఈ సంస్థ, నేడు అధునాతన వసతులతో వెలుగొందడం వెనుక నిర్వాహకుల కళారాధన ఎంతో అభినందనీయమన్నారు.కళాకారులకు గానసభ ఒక ఆలయం అని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ తన తండ్రి కళా సుబ్బారావు, ఆయన మిత్రులు గుండవరపు హనుమంతరావు, చెరువు పార్థసారథి, దయానంద్ తదితరుల సహకారంతో ఈ సంస్థ స్థాపించబడిందని తెలిపారు. సాహిత్య, శాస్త్రీయ, నృత్య, సంగీత కార్యక్రమాలకు వీలును బట్టి వీటిని ఉచితంగానే ఇస్తున్నాం. ఎందరో సాహిత్య, కళాకారుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తూనే, మరోపక్క ఉచితంగా సంగీతం, నృత్యాల్లో శిక్షణా తరగతులు కూడా అందిస్తున్నామని అన్నారు. అలాగే సంగీత గురువు మంజుల తన శిష్య బృందంతో కలిసి ఆలపించిన వాగ్గేయకారుల కీర్తనలు సభికులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుఈ సందర్భంగా నృత్యగురువు వాసు, గాయని మంజుల, జ్వాలాముఖి లను సత్కరించారు.

సంగీత నృత్యకళాకారులను సత్కరిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్, చిత్రంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్దన మూర్తి తదితరులు

మాన్‌సూన్ రెగెట్టాలో తెలంగాణ సెయిలర్ల హవా

-అండర్-16 ఆప్టిమిస్ట్ క్లాస్ అగ్రస్థానంలో మణి

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:

ప్రతిష్ఠాత్మక 17వ వైఏఐ మాన్‌సూన్ రెగెట్టా నేషనల్ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ మూడో రోజు తెలంగాణ సెయిలర్లు అద్భుత ప్రదర్శనతో దాదాపు అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించారు. హుస్సేన్‌సాగర్ వేదికగా బుధవారం అండర్16 ఆప్టిమిస్ట్ క్లాస్‌లో మూడు రేసులను నిర్వహించారు. తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ (టీఎస్ఏ) సెయిలర్ నిల్కొండ మణి రెండు రేసుల్లో టాప్3లో నిలిచి లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. డిఫెండింగ్ నేషనల్ చాంపియన్ రవికుమార్ బన్నెవోలు.. ఒక రేసులో విజయం, మరో రేసులో రెండో స్థానాన్ని సాధించి తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. ఓవరాల్‌గా రెండో ప్లేస్‌లో ఉన్నాడు. అయితే, మూడో రోజు రేసుల్లో రోజువారీ కూలీ కుమారుడైన వుట్ల నరసింహ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఇటీవల సింగపూర్ నేషనల్స్ పూర్తి చేసుకుని తిరిగొచ్చిన నరసింహ హోరాహోరీగా సాగిన మూడో రేసులో జాతీయ చాంపియన్ రవికుమార్‌ను వెనక్కి నెట్టి అగ్ర స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ చాంపియన్‌షిప్‌లో నరసింహకు ఇదే తొలి రేసు విజయం. దాంతో లీడర్‌బోర్డ్‌లో అతను ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచాడు.

రమీజా భాను జోరు..

అండర్16 బాలికల విభాగంలో తెలంగాణకు చెందిన రమీజా భాను, శృంగారి రాయ్ (ఎస్ఎస్ఏ) తొలి రెండు స్థానాలతో పోడియం వైపు దూసుకెళ్తున్నారు. ఇక అండర్16 నోవీసెస్ (నైపుణ్యులను పరీక్షించే) విభాగంలో సికింద్రాబాద్ మడ్‌ఫోర్ట్ స్కూల్‌కు చెందిన వీర్ విష్ణేష్ మూడు విజయాలతో టాప్‌లో నిలవగా, తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్‌కు చెందిన మహమ్మద్ రెహ్మాన్ తర్వాతి స్థానంలో నిలిచాడు. బాలికల నోవీసెస్ విభాగంలో మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రోషిణి టాప్‌గా నిలివింది. ఇక, లేజర్ బాయ్స్ విభాగంలో నేవీకి చెందిన ప్రీత్ సివాల్, హృదయ్ జోషి, ఎమ్‌జేపీటీ స్కూల్స్‌కు చెందిన కౌనిక్ వర్ధన్ టాప్3లో ఉన్నారు. లేజర్ గర్ల్స్ విభాగంలో నేవీకి చెందిన కాత్యాయని కౌశిక్, రమ్యశ్రీ (ఎమ్‌జేపీటీ స్కూల్) గోల్డ్, సిల్వర్ మెడల్స్ కోసం పోటీ పడుతున్నారు. 29ఇఆర్ బాయ్స్ స్కిఫ్స్ క్లాస్‌లో తెలంగాణ ద్వయం వినోద్ దండు అరవింద్ మలోత్ జోడీ 7 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్‌లో చంద్రలేఖ ధనుష్, బద్రినాథ్ రిశ్విక జోడీలు కేవలం ఒక్క పాయింట్ తేడాతో తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

పోటీల్లో గెలుపొందిన తెలంగాణ సెయిలర్ మణి

ఈఎన్‌సిని శ్రీనివాస్‌ను కలిసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్

బదిలీలు విజయవంతంగా నిర్వహించడం పట్ల హర్షం

పెండింగ్ పదోన్నతుల ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి వినతి

హైదరాబాద్,జూన్ 4,ప్రభాతవార్త:

ఇరిగేషన్ శాఖలో ఇంజనీరింగ్, మినిస్టీరియల్ సిబ్బంది సాధారణ బదిలీలను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా విజయవంతంగా నిర్వహించడం హర్షణీయమని ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (అడ్మిన్) తమటం శ్రీనివాస్‌ను అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏటిఏఈఈ)తెలంగాణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.ఈమేరకు గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్.నాగరాజు, కోశాధికారి సంతోష్‌రెడ్డిల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించింది. అలాగే బదిలీలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని వచ్చిన కథనాలను సంఘం తీవ్రంగా ఖండించింది. సాధారణ బదిలీల ప్రక్రియలో ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, ఎటువంటి వివాదాలకు తావులేకుండా రెండు వేలపై చిలుకు ఉద్యోగులకు బదిలీల ప్రక్రియను విజయవంతం గా పూర్తి చేయడం అభినందనీయమని తెలిపింది. అలాగే శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను కూ డా త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా అందుకు సానుకూలంగా స్పందించి భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు.

నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత : జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 4, ప్రభాతవార్త

భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించేందుకు వర్షపు నీటి సంరక్షణ అత్యంత కీలకమని ప్రతి పౌరుడు నీటి సంరక్షణ కోసం పాటుపడాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అన్నారు. గురువారం కూకట్‌పల్లి జోన్ పరిధిలో కెపిహెచ్‌బి పార్క్ ప్రాంతంలో నిర్వహించిన జలసంరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతలను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. నగరంలో పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి వద్ద, ప్రతి సంస్థలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా భూగర్భ జలాల మట్టాలను పెంచవచ్చని తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టు భవిష్యత్తు తరాలకు విలువైన ఆస్తి అని పేర్కొన్నారు.కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంకుడు గుంతను నిర్మించి ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ కార్యక్రమాలు ఉద్యమ రూపం దాల్చుతాయని పేర్కొన్నారు. అలాగే జలమండలి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఉపయోగంలో లేని బోర్లను ఇంజెక్షన్ బోర్లుగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. అందులో భాగంగా, ఇంజెక్షన్ బోర్లుగా మార్చిన 40 బోర్లను అయన వర్చ్యువల్‌గా ప్రారంభించారు.జలమండలి ఆధ్వర్యంలో ఈ సంవత్సరంలో ఇప్పటికే 24 వేల ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయిందని, నగర వ్యాప్తంగా 30 వేల ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు. మిగిలిన లక్ష్యాలను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, ప్రభు, జీఎం హరిశంకర్, ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి సత్యనారాణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌పై అనుచిత బ్యానర్లు..

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీసీపీకి బీజేపీ వినతి.

నిజాంపేట్, జూన్ 4, ప్రభాతవార్త

పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు, విమర్శలతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేసిన వ్యక్తులను గుర్తించి వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డీసీపీ రితీ రాజ్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా అనుచిత రాతలు, వ్యాఖ్యలతో బ్యానర్లు ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన బ్యానర్ల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, బీజేపీ మాజీ కార్పొరేటర్, రాష్ట్ర మున్సిపల్ సెల్ కోకన్వీనర్ రావుల శేషగిరి రావు, జిల్లా నాయకులు సదానంద్, కట్టా కుమార్, రచ్చ చక్రధర్, యాదగిరి, సొరబ్ సింగ్, వేణు, వెంకటేష్, రామ్ సాయి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి నూతన చైర్మన్‌గా మధుసూధన్ యాదవ్

గోపి శెట్టి రాఘవేందర్ నుంచి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్యాల మధుసూధన్ యాదవ్

చార్మినార్,జూన్ 4 ప్రభాతవార్త : భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి నూతన చైర్మన్‌గా మల్యాల మధుసూదన్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఇప్పటి వరకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన గోపిశెట్టి రాఘవేందర్ గురువారం మధుసూదన్ యాదవ్‌కు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు.ఊరేగింపు కమిటి ఆధ్వర్యంలో గురువారం అక్కన్న మాదన్న సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మధుసూదన్‌యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి నూతన చైర్మన్ ఎం.మధుమధుసూధన్ యాదవ్ మాట్లాడుతూ పాతబస్తీలో ఆషాడం మాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.ఈసమావేశంలో ఉత్సవాల నిర్వాహకులు గాజుల అంజయ్య,పొట్టేలు సదానంద్ యాదవ్,రాకేష్ తివారీ,ప్రవీణ్ కుమార్ గౌడ్, మారుతి యాదవ్,ప్రభాకర్,శ్రీకాంత్,గురునాథ్ రెడ్డి పాతబస్తీలోని పలు దేవాలయాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్స్ డైరెక్టర్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలి : దళిత, బిసి సంఘాలు

సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: తెలంగాణ ప్రజలకు గుండెకాయ, ఆంధ్రప్రదేవ్, కర్ణాటక, మహారాష్ట్ర పేద ప్రజలకు కార్పోరేట్ ఆసుపత్రిగా పేరుగాంచిన నిమ్స్ ఆసుపత్రిలో అవినీతి పరుడైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పను తక్షణమే భర్తరఫ్ చేయాలని పలు దళిత, బిసి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆ సంఘాల నేతలు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. గతంలో సిఎం, డిసిఎం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తదితరులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ నల్ల సూర్యప్రకాష్, సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పోకల కిరణ్‌కుమార్, భారతీయ తెలంగాణ రాష్ట్ర సమితి ఛైర్మన్ గొల్లపల్లి దయానందరావు, భారతీయ మహిళా విమోచన సమితి అధ్యక్షురాలు కోయి లక్ష్మీ పార్వతి తదితరులు మాట్లాడుతూ పలు అంశాలలో బీరప్ప అవినీతికి పాల్పడుతున్నారని విజిలెన్స్ అధికారుల విచారణ జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ఆయన్ని బర్తరఫ్ చేయాలని, అసలు ఈ నెల 6వ తేదీతో ఆయన పదవి కాలం ముగుస్తున్నదని, తక్షణమే సర్చ్ కమిటిని వేసి దళిత వర్గానికి చెందిన మంచి వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత రెండు సార్లు బిసిలు నిమ్స్‌కు డైరెక్టర్‌గా ఉన్నారని, ఒక్కరూ కూడా దళితులు లేరని, ఈ సారి దళితులకు అవకాశం కల్పించాలని కోరారు. బీరప్పను తొలగించకపోతే అన్ని దళిత, బిసి సంఘాలు ఉద్యమిస్తాయని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మహమ్మద్ ఇక్బాల్, సాయికుమార్, పాశం రాజేందర్‌యాదవ్, జంగన్నగౌడ్, మారోజు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు బహిరంగ లేఖను విడుదల చేస్తున్న దళిత, బిసి సంఘాల నాయకులు

అరుంధతినగర్‌లో ప్యాచ్‌వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలి

చిక్కడపల్లి జూన్ 4 ,ప్రభాతవార్త : గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతినగర్ బస్తీలో పెండింగ్‌లో ఉన్న ప్యాచ్ వర్క్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానిక మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ కోరారు. గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామ్రాట్ అశోక్, డైరెక్టర్ ఎన్.ప్రభులను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పావని వినయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సహకారంతో రూ.55 లక్షల నిధులతో అరుంధతినగర్ బస్తీలో నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులను గతంలోనే పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే పైప్‌లైన్ పనులు పూర్తయినప్పటికీ, అక్కడ చేయాల్సిన ప్యాచ్‌వర్క్ (రహదారి మరమ్మతులు) పనులను అలాగే వదిలేశారని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రహదారి సరిగ్గా లేకపోవడం వల్ల బస్తీలోని వృద్ధులు, చిన్నారులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆమె వివరించారు.మాజీ కార్పొరేటర్ వినతిపై జలమండలి ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. వారం రోజుల్లోనే అరుంధతినగర్ బస్తీలో ప్యాచ్‌వర్క్ పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నాయకులు ఎం.ఉమేష్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఈడీ సామ్రాట్ అశోక్, డైరెక్టర్ ఎన్.ప్రభులను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

ఢిల్లీకి తరలివెళ్లిన శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలక లంబకు మద్దతుగా ఢీల్లీకి తరలివెళ్లిన ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, జూన్ 4 ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క ఆదేశాల మేరకు, 33 మహిళా రిజర్వేషన్ బిల్లు మీద పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలక లంబకు మద్దతుగా నగరం నుంచి పెద్దఎత్తున మహిళా కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం న్యూఢిల్లీ ఏఐసీసీ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మహిళా రాజ్యేషన్ బిల్లు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బోధ లక్ష్మ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలి



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న టీఆర్ఎస

సిపి సుమతిని కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సీపీ సుమతికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, జూన్ 4 ప్రభాతవార్త:
మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన సుమతిని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై తీసుకుంటున్న నివారణ చర్యల గురించి ఎమ్మెల్యే సీపీతో చర్చించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజల భద్రత, శాంతియుత వాతావరణం కోసం పోలీస్ శాఖకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఈ సందర్భంగా తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాస్వత పరిష్కారం: లక్ష్మీకాంత్ రెడ్డి



కాలనీ వాసులుతో నేతలు

అల్వాల్, జూన్ 4 ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి ప్రణాళికాబద్ధమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని మల్కాజిగిరి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం భూదేవినగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ కాలనీలో పార్టీ శ్రేణులు పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. పారిశుధ్యం, వరద నీటి సమస్యలను ప్రధానంగా కాలనీ వాసులు నేతలు దృష్టికి తెచ్చారు. వర్షాకాలంలో ప్రతి ఏడాది ఇళ్ళలోకి నీరు ప్రవేశిస్తోందని శాస్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేశారు. వరద నీరు సాఫీగా ముందుకు సాగేందుకు అన్ని చర్యలు ఉంటాయని ప్రధానంగా నాలాలు పూడిక తీత పనులను యుద్ధ ప్రాతిపదికతన చేపడతామని లక్ష్మీకాంత్ రెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేబుల్ శేఖర్, నిమ్మ అశోక్ రెడ్డి, వెంకట్రావు, బిఎన్ రమేష్, కృష్ణ గౌడ్, భాస్కర్, శకుంతలా నాయుడు, బబిత, లావణ్య, శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు అన్యాయం జరుగుతుంది : మాల జెఏసి

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందచేస్తున్న ఛైర్మన్ బాలకిషన్ తదితరులు

బేగంబజార్, జూన్ 4ప్రభాతవార్త:
ఎస్సీ వర్గీకరణ వల్ల మాల కులస్తులకు,మాల ఉద్యోగులకు,మాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ మాల జె.ఎ.సి ఆధ్వర్యంలో తెలంగాణ పంచాయితీరాజ్,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అంద చేశారు. మాలజె.ఎ.సి సంఘాల చైర్మన్ మందాల బాస్కర్,గ్రేటర్ హైదరాబాద్ మాల జె.ఎ.సి చైర్మన్ బేరా బాలకిషన్,(బాలన్న)లే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల మాలకుస్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.రోస్టర్ విధానాన్ని సవరించి వెంటనే ఆశాస్త్రీయంగా జరిగిన ఎస్సీ వర్గీకరణను చట్టబద్దంగా అసెంబ్లీలోవర్గీకకరణ బిల్లును ప్రవేశ పెట్టి అమోదింప చేసి 59 కులాలకు సమ న్యాయం జరిగే విధంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయి తీశాఖ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు.లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో మాల విద్యార్థి జె.ఎ.సి చైర్మన్ మాదాసు రాహుల్ రిటైర్డ్ ఎమ్మార్వో సఖీ గంగాధర్,బాల కృష్ణ,బత్తులరమేష్,దిలీప్,అనిష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిని రక్షించిన పోలీసులకు సన్మానం

టప్పాచబుత్ర పోలీసులను సన్మానించిన బోనాల శ్రీనివాస్‌గుప్త....

అఫ్జల్‌గంజ్, జూన్ 4ప్రభాతవార్త: విద్యుత్ స్తంభంపైకి ఎక్కి చేస్తున్న విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో పాటు కింద పడిపోవడంతో అపస్మారస్థితికి చేరుకున్న ఉద్యోగికి సకాలంలో (సిపిఆర్)చేసిఅతని ప్రాణాలను కాపాడిన టప్పాచబుత్రా పోలీసులను ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్త అభినందించారు.టప్పాచబుత్రా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ బి.సురేషీలను కలిసి పుష్పగుచ్చాలు అందచేసి శాలువ కప్పి సన్మానించారు.బోనాల శ్రీనివాస్ గుప్తమాట్లాడుతూ విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడిన విద్యుత్ ఉద్యోగి రాజునాయక్‌కు టప్పాచబుత్రాపోలీసులు సమయ స్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు.సిపిఆర్ చేసి ప్రాణాలనుకాపాడటం గొప్ప విషయమన్నారు.కార్యక్రమంలో ప్రజా ఏక్తా పార్టీ నాయకులు ఎం.కె.శ్రీనివాస్, రజనీకాంత్, వంజరి,చందన్‌సింగ్ పాల్గొన్నారు.

కార్వాన్ డివిజన్‌లో తాగునీటి సరఫరా మెరుగుపరచండి

కార్వాన్,జూన్4 (ప్రభాతవార్త)
కార్వాన్ డివిజన్ పరిధిలోని సబ్జిమండి,బోయిబస్తీ,అందరూన్ కార్వాన్,దర్యాబాగ్,గంగానగర్,న్యూ గంగానగర్,క్రాంతి భవన్,శివాలయం లేన్,కార్గిల్ నగర్,సాగర్ వీది,దర్జీ గల్లి,మరాఠి బస్తీ,శివాజీ నగర్,కార్వాన్ కమాన్ పరిసర ప్రాంతాల ప్రజలు తాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ కార్వాన్ డివిజన్ అధ్యక్షులు ఉద్దడి జగదీష్ బృందం జలమండలి కార్వాన్ సెక్షన్ అధికారిని కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ ప్రాంతాలలో తాగునీటి సరఫరా లో ప్రెషర్ ఉండటంతో పాటు,కొన్ని ప్రాంతాలకు అసలు నీటి సరఫరా అందడం లేదని వాపోయారు.ప్రజలు తమ రోజువారీ అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశార.పై సమస్యలను అత్యవసరంగా పరిశీలించి,నీటి సరఫరా ప్రెషర్ ను పెంచి,నీటి సరఫరా వ్యవధిని పెంచవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివరత్నం,పడాల అనంత కృష్ణ,కట్ట నర్సింగ్,నిరంజన్,భగవాన్,శ్యామ్ సుందర్,కట్ల అశోక్,గంజి రగునాథ్,బాలకృష్ణ,భరత్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత భూములను తీసుకోవద్దు : మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

ముషీరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త: ఎన్నో ఏళ్ల నుంచి భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న దళితులను పక్కకు పెట్టి, వారి భూములను ప్రభుత్వం తీసుకోవటం సరికాదని, దళితభూములను ప్రభుత్వం తీసుకునే పద్ధతికి స్వస్తి పలకాలని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ లకు చెందిన భూముల సేకరణకు సంబంధించి, ఉత్పన్నమయిన సమస్యలపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమీషన్ (ఎన్‌సిఎస్‌సి) డైరెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ గతంలో తెలంగాణాలో ప్రభుత్వానికి పనికిరాని భూములు దళితులకు ఇవ్వగా, వారు ఆ భూములను సాగుచేసుకుని, వ్యవసాయం చేసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈమధ్య భూముల ధరలు పెరగటంతో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములను వెనక్కు తీసుకుని, బడా కాంట్రాక్టర్లకు ఇచ్చి, డబ్బు చేసుకోవటం చాలా బాధాకరమని, ఆవేదన వ్యక్తం చేశారు. బండరావిరాల గ్రామానికి వెళ్లి, పరిశీలిస్తే గత 50 సంవత్సరాల క్రితం దళితులకు ఇచ్చిన 135 ఎకరాల భూమిని, పది కోట్ల నష్టపరిహారం ఇస్తామని జీవో ఇచ్చి కూడా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకపోవటం దారుణమని అన్నారు. దళితుల భూములను ప్రభుత్వం తీసుకోవటం, ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోవటం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోందని, దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు ఉండగా దళిత భూములే ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, రాష్ట్రవ్యాప్తంగా దళితుల భూములు ఎంత తీసుకున్నారు, ఎవరికి నష్టపరిహారం ఇచ్చారు అనే అంశంపై విచారణ జరిపించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ప్రజల కోసం కాకుండా కాంట్రాక్టర్ల కోసం పనిచేయటం చాలా బాధాకరమని, దీనిపై త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహాశక్తి నాయకులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కమీషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, జూన్ 4 ప్రభాతవార్త: అల్వాల్ ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఎంఎంసి కమీషనర్‌ను కోరారు. గురువారం కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసిన ఆయన ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి అన్ని అనమతులు ఉన్నా స్థానిక రాజకీయాలు ఇబ్బందులను సృష్టిస్తున్నాయని తెలిపారు. జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ తీర్మాన లేఖను ఎమ్మెల్యే కమీషనర్‌కు అందించారు. గ్రామ కంఠానికి చెందిన 11 గుంటలు స్థలాన్ని వివాదంలోకి లాగారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఫైర్ స్టేషన్ లేని కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే సేవలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.అల్వాల్ ఫైర్ స్టేషన్ ఏర్పాటు ద్వారా సమీపంలోని ప్రాంత వాసులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణ పరిధి లోని సమస్యలకు సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావించడం జరిగింది. ఎమ్మెల్యే వినతికి సానుకూలంగా స్పందించిన కమీషనర్ అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలి -సునీల్ కుమార్

సిబిఎస్ఈ రీజినల్ ఆఫీసర్ సునీల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సెయింట్ పీటర్ హై స్కూల్ కరస్పాండెంట్ టి.ఏ.రెడ్డి

కంటోన్మెంట్, జూన్ 4 ప్రభాతవార్త:
విద్యార్థుల జీవితాల్లో టీచర్లు వెలుగులు నింపేందుకు నిజమైన హిరోలుగా మారాలని సిబిఎస్ఈ రీజినల్ ఆఫీసర్ జె.సునీల్ కుమార్ తెలిపారు. తెలంగాణ సిబిఎస్ఈ రీజినల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ హై స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి,నైతిక విలువలు,జీవిత నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ టి.ఏ.రెడ్డి,ప్రిన్సిపల్ సువర్ణలు సునీల్‌కు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.

అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, జూన్ 4, ప్రభాతవార్త:
అమీర్‌పేట్ మైత్రివనం ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ గురువారం ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, సహాయక చర్యల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, బాధితులకు తక్షణ సహాయం అందించే అంశంపై అధికారులతో చర్చించారు.అనంతరం అగ్నిప్రమాదంలో నష్టపోయిన దుకాణ యజమానులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, బాధిత వ్యాపారులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం, సంబంధిత అధికారులు బాధితులకు అండగా ఉంటారని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాభిమానులకు "ఆటా" ఆహ్వానం

-సాహిత్య కమిటీ చైర్‌పర్సన్ వేణు నక్షత్రం

హైదరాబాద్,జూన్ 4,ప్రభాతవార్త: అమెరికాలో ప్రముఖ తెలుగు సంఘం అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 19వ మహాసభలు బాల్టీమోర్ నగరంలో జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా "ఆటా "సాహిత్య విభాగం చేపట్టనున్న సాహిత్య పోటీలు, కార్యక్రమాల వివరాలను సాహిత్య కమిటీ చైర్ వేణు నక్షత్రం ఓప్రకటనలో వెల్లడించారు. సాహిత్య రంగంలో ప్రతిభను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ స్థాయిలో తెలుగులో నవలల పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అమెరికా జాతీయ స్థాయిలో కథల, కవితల పోటీలను వివిధ నగరాల్లో ప్రత్యక్ష పఠన రూపంలో నిర్వహిస్తారని చెప్పారు. ఆగస్టు 1న పుస్తకావిష్కరణలు, స్వాగతోపన్యాసం, కవిత్వం ఫైనల్స్, కథల ఫైనల్స్ నిర్వహిస్తారని, ఆగస్టు 2న అవధానం, వక్తల ప్రసంగాలు, సాహిత్య అభిమానుల కోసం ప్రత్యేక వేదిక, కథల-కవితల పోటీల ఫలితాల ప్రకటన, బహుమతి ప్రదానోత్సవం జరగనున్నాయని తెలిపారు. సాహిత్య కార్యక్రమాల్లో ప్రవేశం పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. సాహిత్య కమిటీ చైర్‌గా వేణు నక్షత్రం, కోచైర్లుగా సూర్య నంపల్లి, రాజ్‌కుమార్ వ్యవహరిస్తుండగా, జయదేవ్ మెట్టుపల్లి, ప్రకాష్ తిమ్మాపురం, రాజేశ్వర్ రావు టేక్మల్ సలహాదారులుగా ఉన్నారు. కాన్ఫరెన్స్ కోర్ కమిటీలో ప్రెసిడెంట్ జయంత్ చల్లా, కన్వీనర్ శ్రీధర్ బనాలా, కోఆర్డినేటర్ రవి చల్లా తదితరులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాహిత్య కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆటా అధికారిక వెబ్‌సైట్లను సందర్శించాలని నిర్వాహకులు కోరారు.

తెలంగాణపై మాట్లాడే నైతిక హక్కు కల్వకుంట్ల కుటుంబానికి లేదు

సమావేశంలో మాట్లాడుతున్న నల్లెల్ల కిషోర్

ముషీరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త: తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణపై మాట్లాడే నైతిక హక్కు లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు స్పష్టం చేశారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సమాజంలో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ, రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలతో పాటు, కవిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణలో నిజమైన అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీనేనని గుర్తు చేశారు. పటేల్, పట్వారి వ్యవస్థను రద్దు చేసి, బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని ఇవ్వటమే కాకుండా హైదరాబాద్‌ను జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అంతర్జాతీయ పటంలో నిలిపింది తెలుగుదేశం పార్టీ అని, బీఆర్ఎస్ పాలనలో కేవలం ప్రభుత్వ భూములను అమ్ముకోవటం తప్ప తెలంగాణ కోసం చేసింది ఏమీ లేదని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు తెలంగాణ అభివృద్ధిపై ఒక్క శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకత్వం టీడీపీ భిక్షేనని, బీఆర్ఎస్ నాయకులంతా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో ఉండి, ఎదిగినవారేనని, కేటీఆర్ పేరును కూడా టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ స్ఫూర్తితో పెట్టుకున్నదేనని గుర్తు చేశారు. తమ స్వార్థ రాజకీయాల కోసం టీఆర్ఎస్ లోని తెలంగాణ పదాన్ని తొలగించి, బీఆర్ఎస్‌గా మార్చి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని నిలదీశారు. తెలంగాణలో పోటీ చేసే అధికారం, హక్కు భారతదేశంలోని ఏ పౌరునికైనా, ఏ రాజకీయ పార్టీకైనా ఉంటుందని, బీఆర్ఎస్ నేతలు మైకులను విరగ్గొట్టటం, సభలను అడ్డుకోవటం కాకుండా దమ్ముంటే నేరుగా ప్రజా దర్బార్‌లోకి వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పని, ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు సుదర్శన్, తడక వినోద్, శ్యాంసుందర్, భానుప్రకాష్, అనిల్ కురుమ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలలో బిసిలదే రాజ్యాధికారం

సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాబోయేది బిసిల రాజ్యమేనని బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. 2028లోగాని, 2029లో గాని జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిసిలు అధికారంలోకి వస్తారని వారు స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖబద్దార్ పవన్‌కళ్యాణ్ తెలంగాణ ముమ్మాటికి మాజాగిరే-మా అయ్య జాగిరే అని వారు చెప్పారు. ఎపికి చెందిన అగ్రవర్ణాల రాజకీయ శక్తులు ప్రాంతీయ విభేదాలు రెచ్చగోట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎపిలో సిఎం చంద్రబాబునాయుడికి అక్కడ పాలన చేయడం చేతగాక తెలంగాణలో దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని, అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా పాలించడం చేతగాకనే తెలంగాణపై విద్వేషం పెంచుకున్నారని వారు విమర్శించారు. తెలంగాణకు ఎవరూ వచ్చిన ఓట్లు వేయరని స్పష్టం చేశారు. పవన్‌కళ్యాణ్ వెనుక బిజెపి, టిడిపి ఉన్నాయని, బిసిలను అణిచివేసేందుకు బిజెపి కుట్ర పన్నుతున్నదని విమర్శించారు. తెలంగాణలో బిసిల ఉద్యమం పెద్ద ఎత్తున ప్రారంభమైందని, గతంలో జరిగిన గ్రామ, మున్సిపల్ ఎన్నికల్లో రుజువు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని మోసం చేసిందని, ఇవన్ని అగ్రకుల పార్టీలేనని వారు ధ్వజమెత్తారు. తెలంగాణలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రావచ్చునని, ఉండవచ్చునని, కాని విద్వేష మాటలు మాట్లాడి ప్రజలను రెచ్చగోట్ట రాదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు అయిలి వెంకన్నగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, అంబాల నారా యణగౌడ్, ఎలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్ తది తరులు పాల్గొన్నారు.

చివరి దశకు చేరుకున్న జనగణన-2027 సర్వే

విజయ చిహ్నం చూపుతున్న ఎన్యూమరేటర్లు

చాంద్రాయణగుట్ట, జూన్ 4, ప్రభాతవార్త :
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన-2027 సర్వే జీహెచ్ఎంసి పరిధిలోని కొన్ని సర్కిళ్లలలో చురుకుగా సాగుతుంది. ఆయా సర్కిళ్ళ డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో వార్డు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు ఎన్యూమరేటర్లతో కలిసి నిర్దేశించిన ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. చార్మినార్ సర్కిల్ పరిధిలోని హరిబౌలి, గౌలిపురా సర్కిల్ 41లో దాదాపు సర్వే పూర్తి కావచ్చింది. ఆ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత ఏరోజుకారోజు ప్రత్యేకంగా సర్వేను పరిశీలిస్తున్నారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేస్తూ సర్వే వేగం పెంచారు. దీంతో ఎన్యూమరేటర్లు ఉదయం, సాయంత్రం వేళ, రాత్రి పొద్దు పోయే వరకు సర్వే నిర్వహిస్తున్నారు. ఫీల్డ్ ఆఫీసర్ అమీర్ ప్రతిరోజు సర్వే జరుగుతున్న తీరును పరిశీలిస్తూ ఎన్యూమరేటర్లను ప్రొత్సహిస్తున్నారు. ప్రస్తుతం 90 శాతం సర్వే పూర్తి అయ్యింది. సూపర్‌వైజర్ మందడి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఎన్యూమరేటర్లు శ్రీనివాస్, సాగర్, మాధవి, రవికాంత్, శాంతమ్మ, అశ్విని, సారిక, శీను నాయక్‌లు సర్వేను కొనసాగిస్తున్నారు. జనగణన-2027 మొదటి దశ మే 11న ప్రారంభమై జూన్ 9వ తేదీ వరకు 30 రోజుల కాలవ్యవధితో రాష్ట్రంలోని ఇండ్ల జాబితా, ఇండ్ల గణన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

గుట్ట మంచినీటి సమస్యపై కదిలిన అధికారులు

'వార్త' ఎఫెక్ట్

చాంద్రాయణగుట్ట, జూన్ 4, ప్రభాతవార్త :
'చాంద్రాయణగుట్టను పీడిస్తున్న కలుషిత నీరు, లోప్రెషర్' అన్న శీర్షికన గురువారం ప్రచురితమైన 'వార్త'కు జలమండలి అధికారులు స్పందించారు. గత కొన్ని నెలలుగా పెండింగులో పెట్టిన ఫైళ్ళను కదలించారు. చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ రాసిన సిఫార్సు లేఖపై చర్యలు చేపట్టారు. కేశవగిరిపై గల శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం, శ్రీ శివాలయం, శ్రీ బ్రమరాంబదేవి సమేత చెన్నమల్లికార్జునస్వామి దేవాలయాలకు నిరంతర మంచినీటి సరఫరా కోసం అసంపూర్తిగా ఉన్న పైప్‌లైన్, బూస్టర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ జలమండలి హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ సామ్రాట్ రాజేంద్రనగర్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్‌ను ఆదేశించారు. అదేవిధంగా చాంద్రాయణగుట్ట గాంధీ విగ్రహం, నారాయణ్‌బాగ్, కుమ్మరివాడి, హరిజనబస్తీ పరిసర బస్తీలలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. డివిజన్ 8 జనరల్ మేనేజర్ కె.భాస్కర్ సంబంధిత ఫైళ్ళతో ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమైయ్యారు.

గౌరవ మొదటి అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు నందు, భువనం
I.A.No. 1031/2025
in
O.S.No. 2/2024
బిట్వీన్
పోదల రాధమ్మ మరియు ఇతరులు
...వాదులు
And
మాధిరాజు హనుమంతరావు మరియు ఇతరులు
...ప్రతివాదులు
To...
NOTICE
మల్లినేని పార్థు, తండ్రి: శ్రీనివాసరావు, వయస్సు : 30 సంలు, వృత్తి : వ్యాపారం, R/o. Plot No. 74 ISOLA రెసిడెన్సీ, Flat No. 501, సెంట్రల్ బ్యాంక్ బిల్డింగ్, కళ్యాణ్‌నగర్, East-1 SR Nagar, అమీర్‌పేట్, హైదరాబాద్.
పైన పేర్కొన్న దావా నందు మీరు ప్రతివాది నెం. 19 గా ఉండియున్నారు. మీకు ఎన్ని వర్యాయములు కోర్టు వారి నుండి నమనులు వంపినామ్ము. మీరు ఉద్దేశపూర్వకంగా తిరిగి పంపుచున్నారు. ఇట్టి దావా తేది 23-6-2026 నాడు గౌరవ కోర్టు వారి వద్ద మీ హాజరు నిమిత్తం వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా కాని లేక మీ న్యాయవాది గారి ద్వారా కాని పైన తెలిపిన తారీఖు నాడు హాజరు కావలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.
//కోర్టు వారి ఆనుమతితో//
ఏడునూతల శ్రీనివాసరావు
ఏడునూతల అనురాధ
అడ్వకేట్స్, భువనం.సెల్: 98490 39167

IN THE COURT OF HON'BLE PRL. DISTRICT JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT :: KUSHAIGUDA
G.W.O.P. No. 41 OF 2026
BETWEEN:-
1. Maryada Arundhaty W/o Dasari Narsimha Reddy, Aged about: 71 years, Occ: Retd. Employee,
2. Dasari Narsimha Reddy S/o Late Achi Reddy, Aged about: 75 years, Occ: Retd. Employee,
(Petitioner No.2 Being mentally disable person Rep. by his wife Petitioner No.1 herein)
Both R/o 62, Dowton Bazaar, near Rythu Bazaar, Bollarum, Secunderabad.
.....Petitioners
AND
Dasari Vikram Reddy and others
.....Respondents
To
All Concerned .....Respondents
Please take notice that the above O.P is filed by the Petitioners seeking permission to appoint the Petitioner No.1

జనగణన కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలి

-జోనల్ కమిషనర్ సత్యనారాయణ

జనగణన సూపర్వైజర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ సత్యనారాయణ, చిత్రంలో డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ తదితరులు

మలక్ పేట, జూన్ 4, ప్రభాతవార్త:

జన గణన కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సౌత్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం బి బ్లాక్ లోని మలక్ పేట్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సత్యనారాయణ డిప్యూటీ కమిషన్ ఇంకేషాఫ్ అలీ లు జనగణన సూపర్వైజర్లు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్లు, ఖాళీగా ఉన్న ఇళ్లను మరల సూపర్వైజర్లు, సిబ్బంది సందర్శించి జనగణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ మాట్లాడుతూ మలక్ పేట్ సర్కిల్ పరిధిలో జనగణన కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని వివరించారు. ఈ కార్యక్రమం అసిస్టెంట్ కమిషనర్ సంజయ్ సింగ్, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వాతి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : సుధీర్ రెడ్డి



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న కాలనీ వాసులు

హయత్ నగర్, మే 4 ప్రభాతవార్త: స్వాతి రెసిడెన్సీ కాలనీలో సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తానని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీఇచ్చారు. మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్న గుట్ట లో వక్కనున్న స్వాతి రెసిడెన్సీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన యూజీడీ, ఇంటర్నల్ పైప్‌లైన్ వ్యవస్థల కారణంగా పలు ఇబ్బందులు ఎదురవుతున్నా యని తెలిపారు. పార్కు ప్రహరీ గోడ నిర్మించాలని, జిమ్ పరికరాలను అందుబాటులోకి తీసుకోని రావాలని కోరారు. రోడ్లు, డ్రైనేజీ, ఇతర సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సాధ్యమయినంత త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు సోమనాథ్, ఉపాధ్య క్షులు భాస్కర్ గౌడ్, ప్రతినిధులు వరుణ్, సురేష్ పాల్గొన్నారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి : దుగ్గు జగదీష్

దుగ్గు జగదీష్ ని సన్మానించి అభినందనలు తెలియజేస్తున్న వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు సుగురు రమేష్, శెట్టి విజయ్ కుమార్, పరసం శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, జూన్ 4, ప్రభాతవార్త:

మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర ఆనియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త దుగ్గు జగదీష్ పేర్కొన్నారు. పవిత్రమైన మానస సరోవర్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని మలక్ పేట్ కు విచ్చేసిన దుగ్గు జగదీష్ దంపతులను మలక్ పేట వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దుగ్గు జగదీష్ మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక దేవాలయాలు, వారసత్వ సంపద ల గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు సూగురు రమేష్, శెట్టి విజయకుమార్, పరసం శ్రీనివాస్, కీర్తి, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పక్షాన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడాలి

ఇబ్రహీం శేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపేంద్ర యాదవ్

ఎల్.బి.నగర్, జూన్ 4 ప్రభాతవార్త:

సమావేశంలో ఉద్యమకారుల పక్షాన మాట్లాడాలని తెలంగాణ ఉద్యమకారుల పోరం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్‌ను టియుఎఫ్ ప్రతినిధులు గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలు నెరవేరే విధంగా చర్చ నిర్వహించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జనిగే విష్ణువర్ధన్, జిల్లా అధ్యక్షుడు జోకరాయి ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ లాల్జీ, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉపేంద్ర యాదవ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇన్చార్జి చిత్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

నేరేడ్‌మేట్, జూన్ 4,ప్రభాతవార్త :

మతిస్థిమితం సరిగా లేని ఓ యువతి ఆరు నెలలుగా కనిపించకుండా పోయిన ఘటన నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌కు చెందిన బి. ప్రియాంక (20) గతంలో పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోయినా తిరిగి ఇంటికి వచ్చేది. అయితే ఆరు నెలల క్రితం ఆమె తల్లి ఇంట్లో లేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. యువతి తల్లి బి. రాణి బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి వద్దతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె నేరేడ్మెట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.అదృశ్యమైన ప్రియాంక ఎత్తు సుమారు ఐదు అడుగులు, చామనచాయ రంగుతో ఉండగా, తెలుగు మాట్లాడుతుంది. ఇంటి నుంచి వెళ్లే సమయంలో గోధుమరంగు చుడీదార్ ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యువతి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా నేరేడ్మెట్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంపి ఈటల

వనస్థలిపురం జూన్.4.ప్రభాతవార్త.

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ చత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్-2026 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎంఎంసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో , డిప్యూటీ కమిషనర్ స్వామి , రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి ,మరియు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, ఎంఎంసి ఇంజనీరింగ్ విభాగం నిని నాగేంద్ర,కనకయ్య, విగ్నేశ్వర , స్పోర్ట్స్ ఇన్స్ట్రక్టర్ విగ్నేష్ హాజరై క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడలు, వ్యక్తిత్వ వికాసం మరియు వివిధ రంగాల్లో శిక్షణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత సర్వ

తోముఖాభివృద్ధికి ఇటువంటి కోచింగ్ క్యాంపులు ఎంతో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు క్రాంతి గౌడ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగని శ్రీనివాస్, సీనియర్ నాయకులు నూతి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శంకరయ్య గౌడ్, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు భార్గవ్ తేజ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్నాథ్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు నరేష్ యాదవ్, నాయిని శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రావు, మధుసూదన్ రెడ్డి, విజయ్, యోగి, కిషోర్, నాగేష్, సిద్దేశ్వర్ మరియు తదితరులు ఉన్నారు.

ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం

మల్కాజిగిరి జూన్ 4 ప్రభాతవార్త :

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బిఎల్ఎ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.రాష్ట్ర మలిదశ ఉద్యమాన్ని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో విజయవంతంగా నడిపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని గుర్తుచేశారు. బంగారు తెలంగాణ లక్ష్య సాధనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కేసీఆర్ తిరిగి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కేసీఆర్ స్ఫూర్తితో పార్టీ శ్రేణులు మరింత కట్టుదిట్టంగా పనిచేయాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను చేపట్టిన పలు కార్యక్రమాలు, సాధించిన నిధులు మరియు అమలవుతున్న అభివృద్ధి పనుల గురించి సమావేశంలో వివరించారు.అలాగే ఓటరు జాబితాలో ఎస్ఐఆర్ అనుసంధాన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి కార్యకర్త ఓటరు నమోదు మరియు ధృవీకరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ ఎంబీసీ చైర్మన్, మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నమోదు ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, మురుగేష్, పార్టీ నాయకులు జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, అమీరుద్దీన్, అనిల్ కిషోర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, కృష్ణ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, ఢిల్లీ పరమేష్, డోలి రమేష్, భాస్కర్ రెడ్డి, అరుణ్ రావు, అరవింద్, శరణ్ గిరి, హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, ఉస్మాన్, కేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

గోవాలో గజదొంగ అరెస్ట్.. రూ.82 లక్షల బంగారం, వెండి స్వాధీనం

నేరేడ్‌మెట్, మల్కాజ్‌గిరి కమిషనరేట్ జూన్ 4,ప్రభాతవార్త :

సికింద్రాబాద్‌లో జరిగిన భారీ ఇంటి చోరీ కేసును మార్కెట్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి, గోవాలో అంతరాష్ట్ర గజదొంగను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.82 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ చ. శ్రీధర్ వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం.. పోట్ మార్కెట్ పరిధిలోని శ్రీ సాయి బులియన్ జ్యువెలరీ షాప్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న సందీప్ రఘునాథ్ చవాన్ తన ఇంట్లో తాళాలు పగులగొట్టి భారీ మొత్తంలో బంగారం, వెండి చోరీకి గురైనట్లు మే 27న మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందం నిందితుడి కదలికలను సాంకేతిక ఆధారాలతో గుర్తించి గోవాకు వెళ్లింది. ఉత్తర గోవాలోని కలంగుట్ ప్రాంతంలో మనోజ్ సింగ్ (28)ను అదుపులోకి తీసుకుంది. ఢిల్లీకి చెందిన ఈ నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన 576 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి సహా మొత్తం రూ.82 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు.విచారణలో మనోజ్ సింగ్ అలవాటైన అంతరాష్ట్ర దొంగగా తేలింది. ఢిల్లీలోనే అతనిపై 19 చోరీ కేసులు నమోదై ఉండగా, పలు

నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో తీహార్ జైలులో కూడా శిక్ష అనుభవించినట్లు వెల్లడైంది.మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి మార్గదర్శకత్వంలో, డీసీపీ చ. శ్రీధర్ పర్యవేక్షణలో, ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వి. రాంచందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎం. బషీర్ అహ్మద్, ఎస్సైలు నరేష్, రవి తదితరులు ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించారు. కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.ప్రజలు ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, సీసీటీవీ కెమెరాలు, సెంట్రల్ లాకింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ సూచించారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

గుండె సంబంధిత వ్యాధిగ్రస్తురాలికి బాలాపూర్ బిఆర్ఎస్ నేతల అండ

సరూర్‌నగర్, జూన్ 4 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ బాలాపూర్ డివిజన్‌లోని బాలాపూర్ పాత గ్రామానికి చెందిన గుండె సంబంధిత వ్యాధిగ్రస్తురాలు గంజాయి శంకరమ్మ వైద్య చికిత్సకు స్థానిక గ్రామ బిఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. ఈ మేరకు స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో వారు రూ.1.50 లక్షలకు సంబంధించిన ఎల్ఓసిని హృద్రోగ వ్యాధిగ్రస్తురాలికి ఇప్పించారు. ఓల్డ్ విలేజ్‌కు చెందిన శంకరమ్మ ఇటీవల నుండి గుండె సంబంధిత జబ్బుతో బాధపడుతూ పరీక్షలు చేయించుకోగా స్టంట్లు వేయించుకోవాల్సిందిగా డాక్టర్లు రిఫర్ చేశారు. దీంతో పేద కుటుంబానికి చెందిన ఆమె వైద్య ఖర్చులను భరించలేక బాలాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులైన భాగ్యనగర్ రైతు సేవాసహకార సంఘం మాజీ డైరెక్టర్ చిగిరింత శ్రీరాంరెడ్డి (పెద్ద నర్సింహారెడ్డి), అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్, కందికంటి అరవింద్‌గౌడ్ తదితరులను ఆశ్రయించింది. ఈ మేరకు స్పందించిన వారు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తెచ్చి ఆమె సిఫారసుతో శంకరమ్మకు వైద్య చికిత్సల కోసం రూ.1.50

బాలాపూర్‌వాసి శంకరమ్మకు రూ.1.50 లక్షల ఎల్ఓసిని అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

లక్షలకు సంబంధించిన సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో గురువారం బిఆర్ఎస్ నేతల సమక్షంలో శంకరమ్మ శ్రీనగర్ కాలనీలో సబితా రెడ్డి చేతుల మీదుగా ఎల్ఓసి పత్రాలు తీసుకున్నారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి గుండెకు స్టంట్లు వేయించుకోవడానికి గురువారం నిమ్స్‌లో చేరారు. సకాలంలో తమను ఆదుకున్న సబితా ఇంద్రారెడ్డికి అదే విధంగా బాలాపూర్ బిఆర్ఎస్ నేతలకు శంకరమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నాలా బాధితులకు న్యాయం చేయాలి : పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, జూన్ 4 ప్రభాతవార్త : ఉప్పల్ నల్ల చెరువు నుంచి పెద్ద చెరువు వరకు రూ.18 కోట్లతో చేపడుతున్న ఎన్ఎన్‌డిపి స్టాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్లాన్ కారణంగా ఆస్తులు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పలువురు బాధితులతో కలిసి మల్కాజిగిరి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిరగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏ ఒక్కరికీ నష్టం లేకుండా నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేయాలని కోరారు. ఉప్పల్‌లోని కావేరి నగర్ నుంచి నల్ల చెరువు వరకు నాలాకు రెండు వైపులా రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం ఎన్ఎన్‌డిపి కింద రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో నాలాకు ఇరువైపులా ఉన్న కావేరి నగర్, న్యూ భరత్ నగర్, హనుమాన్ నగర్, సౌత్ స్వరూప్‌నగర్ తదితర కాలనీవాసులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. నాచారం పెద్ద చెరువు నుండి ఉప్పల్ నల్ల చెరువు వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నట్లు, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్లాన్ కారణంగా ఆస్తులు ప్రభావితమవు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి నాలా బాధితుల సమస్యలు విన్నవిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.వరమేశ్వర్‌రెడ్డి తదితరులు

తాయని నోటీసులు ఇచ్చారని తెలిపారు. మున్సిపల్ నోటీసులతో కాలనీవాసులంతా భయభ్రాంతులయ్యారని తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఇక్కడే నివాసం ఉంటున్నారని, రిటర్నింగ్ వాల్ నిర్మాణంతో ఉన్న ఇళ్లు పోయి రోడ్డున పడతారని తెలిపారు. పనులతో ఏ ఒక్కరికీ నష్టం లేకుండా చూడాలని కోరారు..ఈ కార్యక్రమంలో ఉప్పల్, కావేరి నగర్, నార్త్ స్వరూప్ నగర్, సౌత్ స్వరూప్ నగర్, న్యూ భారత్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్టేట్ టాపర్ రుషికి చిరు యువత నేతల సత్కారం

ఉప్పల్, జూన్ 4 ప్రభాతవార్త : ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ టాపర్‌గా నిలిచిన చిలుకానగర్‌కు చెందిన రుషిని గురువారం ఉప్పల్ చిరంజీవ యువత అధ్యక్షులు బోరంపేట జయకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువారం పెద్ది సినిమా విడుదల సందర్భంగా ఉప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టేట్ టాపర్ రుషిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బోరంపేట జయకృష్ణ మాట్లాడుతూ స్టేట్ టాపర్‌గా నిలిచిన రుషికి పెద్ది సినిమా వీక్షించేందుకు ఉచితంగా కుటుంబ సభ్యులకు టిక్కెట్లు అందజేసినట్లు తెలిపారు.

స్టేట్ టాపర్ రుషిని సత్కరిస్తున్న చిరు యువత అధ్యక్షుడు బోరంపేట జయకృష్ణ తదితరులు

నాచారం డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి :ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఈడీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్,సాయిజన్ శేఖర్

నాచారం, జూన్ 4 ప్రభాతవార్త : నాచారం డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జల మండలి ఈడీ పంకజను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాచారం డివిజన్‌లో చాలా వరకు డ్రైనేజీ సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన ప్రాంతాల్లో సమస్యల నివారణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తే పూర్తి స్థాయిలో ఉపశమనం కల్పించవచ్చని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్ల ఏర్పాటు పూర్తికాకపోవడంతో మంజూరైన రహదారి పనులు నిలిచిపోయిన విషయాన్ని ఈడీ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ పలువురు పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని ఎంపీకి వినతి

ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతల సురేందర్‌యాదవ్

ఎల్.బి.నగర్, జూన్ 4 ప్రభాతవార్త:

కాలనీలో మంచినీటి సమస్య పరిష్కరించారు అవసరమైన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీలో నెలకొన్న త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు త్రాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని ఈటెల రాజేందర్‌కు గురువారం కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కొరత, వేసవి కాలంలో తలెత్తుతున్న ఇబ్బందులు, భవిష్యత్తులో పెరుగుతున్న జనాభా అవసరాలను గురించి కాలనీవాసులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ ప్రజల సమస్యలను విన్న ఎంపీ సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ వినోద్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ మణిపాల్‌రెడ్డి, సబ్యులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సంజీవరెడ్డి, రామ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 4 ప్రభాతవార్త : రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌తో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం బేటి అయ్యారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని, పార్టీ లకు అతీతంగా ఆయన పనిచేస్తారని కొనియాడారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య, ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు భైరి నవీన్ గౌడ్,నేమూరి మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

బీరప్పగడ్డలో వరద నీటి కాలువ పనులు

బీరప్పగడ్డలో వరద నీటి కాలువ పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్, జూన్ 4 ప్రభాతవార్త : ఉప్పల్ బీరప్పగడ్డలో రూ.34 లక్షల వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాలువ పనులను గురువారం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బీరప్ప గడ్డ డివిజన్ గ్రంధాలయం ఎదురుగా ఉన్న వీధిలో శంకరయ్య కిరాణా షాపు వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రజల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు కొక్కొండ జగన్, పలువురు బీరప్పగడ్డ కాలనీ నేతలు ప